



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 316 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 05-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



# ఐదోరోజు పరస్పర దాడులు


## ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు

- ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు
- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం
- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి

టెహ్రాన్,

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారం నాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై

-మిగతా 2 లో





# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలోకి పాకిస్తాన్..?


## సౌదీ కోసం రంగంలోకి దిగుతామన్న పాక్ విదేశాంగ మంత్రి!

- సౌదీ అరేబియాపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోం: ఇరాన్‌కు పాకిస్తాన్ స్ట్రాంగ్ వార్నింగ్.
- సౌదీ రక్షణ కోసం పాక్ అణ్వాయుధాలు బయటకు వస్తాయా?
- అమెరికా కంటే పాకిస్తాన్‌నే నమ్ముకున్న సౌదీ అరేబియా!

న్యూఢిల్లీ

ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంలోకి పాకిస్తాన్ కూడా అడుగుపెడుతుందా..? దీనిపై పాక్ వైపు నుంచి ఔననే సమాధానమే వినిపిస్తోంది. ఈ మేరకు పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ వార్నింగ్ కూడా ఇచ్చేశాడు. అయితే, పాక్ రంగంలోకి దిగబోయేది ఇరాన్‌కు మద్దతుగా కాదు. వ్యతిరేకంగా. సౌదీ అరేబియాపై ఇరాన్ దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా.. పాకిస్తాన్‌కు సన్నిహిత దేశం. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య భద్రత, రక్షణ పరమైన ఒప్పందం ఉంది.వేరే ఏ దేశమైనా ఈ రెండింటిలో ఏ ఒక్క దేశంపై దాడి చేసినా.. మిగతా దేశం దానికి మద్దతుగా నిలవాలి. ఈ అంశంలో సౌదీ అరేబియాతో పాకిస్తాన్ గతంలోనే ఒప్పందం కుదుర్చుకుంది. సౌదీపై వేరే దేశం దాడి చేస్తే పాక్ మద్దతుగా..

-మిగతా 2 లో





### యంగ్ ఇండియా స్కూల్స్

# టెండర్లలో అవినీతి

- త్వరలోనే వివరాలు బయటపెడతాం
- జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, మార్చి 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :** యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు.

-మిగతా 2 లో



### ప్రపంచానికి

# ఇరాన్ షాక్..

- చైనా నౌకలకు మాత్రమే 'గ్రీన్ సిగ్నల్'!
- హార్ముజ్ జలసంధి దాటితే నౌకలకు పేల్చివేస్తామని ప్రపంచ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు.
- ఇరాన్ నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు సెగలు!

న్యూఢిల్లీ

ఇజ్రాయెల్ , అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హార్ముజ్ జలసంధిని మూసివేసింది.ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

-మిగతా 2 లో

### ప్రాజెక్టుల భూసేకరణకు

# 5000 కోట్లు

## సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

- త్వరలోనే స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తాం
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్ల సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష

**హైదరాబాద్,మార్చి 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :** సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.


-మిగతా 2 లో




# విరోష్ జోడీ పెళ్ళి రిసెప్షన్

- హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు
- విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే

2 లో



### హోంమంత్రి అమిత్ షాతో

# సీఎం రేవంత్ భేటీ

- ఇటీవల నక్సల్స్ లొంగుబాటు తదితర విషయాల ప్రస్తావన
- సీఎంను, డీజీపీ బృందాన్ని అభినందించిన అమిత్ షా



**న్యూఢిల్లీ, మార్చి 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అందుకోసం అమిత్ షా నివాసానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ

-మిగతా 2 లో



### భారత్ చేరుకున్న

# ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

## విమానాశ్రయంలో స్టబ్‌కు ఘనంగా స్వాగతం

**న్యూఢిల్లీ, మార్చి 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :** ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ విచ్చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నాం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తోపాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియా చేరుకున్నారు. స్టబ్ తన పర్యటన సందర్భంగా ఇండియాతో కీలక ఒప్పందాలు చేసుకుంటారు.

-మిగతా 2 లో

# ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

## ఇరాన్‌లో పాఠశాల బాలికల మృతిపై కేటీఆర్



హైదరాబాద్,

ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది.

-మిగతా 2 లో

# జైలు నుంచి విడుదలయిన బాల్క సుమన్



- క్యాతనపల్లిలో మంత్రి వివేక గూండాగిరీ
- మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు

**ఆదిలాబాద్, మార్చి 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు.

-మిగతా 2 లో

## ఐదోరోజు పరస్పర దాడులు



మొదటి తరువాయి

ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ గత శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

### యంగ్ ఇండియా స్కూల్స్
## టెండర్లలో అవినీతి

మొదటి తరువాయి

ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు.

## ప్రపంచానికి ఇరాన్ షాక్..

మొదటి తరువాయి



మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా.. ఇరాన్‌పట్ల సానుభూతి చూపుతుండటంతో అందుకు ప్రతిఫలంగా ఇరాన్ చైనా నౌకలకు అనుమతి ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రపంచ దేశాల నడుమ చమురు సరఫరాకు హార్ముజ్ జలసంధి కీలకం. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ తీరాలను ఓపెన్ సముద్రంతో కలిపే కీలక చోక్ పాయింట్. ఈ జలసంధిని మూసివేయడం వల్ల గ్లోబల్ సప్లయ్ చైన్‌కు విఘాతం కలుగుతుంది.

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలోకి పాకిస్తాన్..?

మొదటి తరువాయి



పాకిస్తాన్‌పై ఏ దేశమైనా దాడి చేస్తే సౌదీ మద్దతుగా రావాలి. ఈ లెక్కన ప్రస్తుతం సౌదీపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. దీంతో సౌదీ అరేబియాకు మద్దతుగా పాకిస్తాన్ రంగంలోకి దిగాలి. ఈ ఒప్పందాన్ని స్ట్రాటజిక్ మ్యూచువల్ డిఫెన్స్ అగ్రిమెంట్ (ఎస్ఎండీఏ)గా పేర్కొంటారు. దీనిపైనే పాక్ విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. సౌదీతో తమకు రక్షణ, భద్రతాపరమైన ఒప్పందం ఉందని ఇరాన్‌కు తెలుసని, అవసరమైతే తాము కూడా సౌదీ అరేబియాకు మద్దతుగా యుద్ధంలోకి దిగే అవకాశం ఉందని ఇషాక్ దర్ అభిప్రాయపడ్డాడు. పాకిస్తాన్ నుంచి ఈ యుద్ధంపై వచ్చిన స్పష్టమైన ప్రకటన ఇది. ఇప్పటికిప్పుడు సౌదీకి మద్దతుగా యుద్ధం చేస్తామని పాక్ ప్రకటించకపోయినా, ఈ విషయంలో తమ వైఖరి మాత్రం ఇదేనని పాక్ స్పష్టం చేసింది. ఈ ఒప్పందానికి సంబంధించి పాక్ అణ్వస్త్రాలు కూడా ప్రయోగిస్తుందా అనే విషయంలో స్పష్టత లేదు. ఎందుకంటే పాక్ వద్ద అణ్వాయుధాలున్నాయి. నిజానికి గత ఏడాది కుదిరిన ఎస్ఎండీఏ వివాదాస్పదమైంది. అణు ఆయుధాలు కలిగిన దేశంతో ఇలాంటి ఒప్పందం చేసుకోవడంపై విమర్శలు చెలరేగాయి. సౌదీ.. ధనిక గల్ఫ్ దేశం. అలాంటిది పాక్ తోడైతే ఈ ప్రాంతంలో అది భౌగోళిక రాజకీయ సంక్షోభానికి దారితీయవచ్చని నిపుణుల అంచనా. గత ఏడాది దోహా, ఖతార్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్‌లో దేశాల భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అందుకే సౌదీ అరేబియా.. తమకు మద్దతుగా నిలిచే దేశాలపై దృష్టిపెట్టింది. దీనిలో భాగంగా పాకిస్తాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అందులోనూ అమెరికాపై నమ్మకం లేకపోవడంతో సౌదీ.. పాక్‌తో ఒప్పందం వైపు మళ్లిందనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. సౌదీకి, పాక్‌కు మధ్య ఒప్పందం ఉన్నప్పటికీ పాక్ యుద్ధానికి దిగే అవకాశం లేదు.

# ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు

మొదటి తరువాయి




ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా

ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం

పనులను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

## ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

మొదటి తరువాయి

ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి.ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

## హోంమంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ భేటీ

మొదటి తరువాయి

అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్, డిజిపిలు కేంద్రహోంమంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించి నక్సల్స్ నిర్మూలన జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా సిఎం రేవంత్‌ను, డిజిపి బృందాన్ని అభినందించారు. దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశిరచుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే మీడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజయ్ కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించారని తెలుస్తోంది.

## భారత్ చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు


మొదటి తరువాయి

ఈ మేరకు అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాల్లో ఒప్పందాలు జరుగుతాయి. స్టబ్స్.. ఈ చర్చల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కూడా సమావేశమవుతారు. స్టబ్స్ ఇండియాలో పర్యటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. స్టబ్స్‌కు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్టబ్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా ప్రత్యేకంగా స్పందించారు. భారత పర్యటనపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. గురువారం సాయంత్రం మీడియాతో మోదీ, స్టబ్ మాట్లాడుతారు. ఫిన్‌లాండ్ ప్రధాని పె÷-టటెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక.. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

## విరోష్ జోడీ పెళ్ళి రిసెప్షన్

**హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు**

**విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే**



హైదరాబాద్,

విజయ్ దేవరకొండ- రష్మిక వెడ్డింగ్ రిసెప్షన్ బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విరోష్ జోడీ మెరిసింది. చేతిలో చెయ్యి వేసుకుని హాజరైన ఇచ్చిన ఈ జంట.. తొలుత అతిథులను పలకరించి, తర్వాత సెలబ్రేషన్స్‌లో పాల్గొంది. ఓ హోటల్‌లో ఏర్పాటైన ఈ వేడుకకు సినీ, రాజకీయ తదితర రంగాల ప్రముఖులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, టాలీవుడ్ నుంచి చిరంజీవి, వెంకటేశ్, అక్కినేని నాగార్జున దంపతులు, నాగచైతన్య, రామ్‌చరణ్ దంపతులు, నాని కుటుంబం, నవీన్ పొలిశెట్టి, దర్శకుడు సుకుమార్ ఫ్యామిలీ, నిర్మాత దిల్‌రాజు ఫ్యామిలీ, నమ్రతా శిరోద్కర్, ఆమె కుమార్తె సితార, రాధిక-శరత్‌కుమార్ దంపతులు, హాజరయ్యారు. విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే.తరవాత వారి సొంతూరులో సత్యానారయాణ వ్రతం నిర్వహించారు. తరవాత అభిమానులకు పార్టీ కూడా ఇచ్చారు.

## జైలు నుంచి విడుదలయిన బాల్క సుమన్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశా

# ఘనంగా కనుగుబాయి తండాలో హోలీ పండుగ వేడుకలు



**కడ్తాల్, మార్చి 4 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
రంగారెడ్డి జిల్లా: కడ్తాల్ మండల పరిధిలోని కనుగుబాయి తండాలో హోలీ పండుగ వేడుకలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గానుమార్ల తండా గ్రామ డిప్యూటీ సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్ ఈ సందర్భంగా హోలీ పండుగ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లక్పతి నాయక్ మాట్లాడుతూ.. హోలీ మీ ఇంట్లో మరియు మీ జీవితాల్లో సుఖశాంతులను నింపాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి బిక్యా నాయక్,మాజీ సర్పంచులు రాములు నాయక్,పండు నాయక్,మాజీ డిప్యూటీ సర్పంచ్ శారద పండు నాయక్,వార్డు సభ్యులు లచ్చయ్య నాయక్,నాగార్జున్ నాయక్,జెమ్లా నాయక్,నార్య నాయక్,జన్య నాయక్,రెడ్యా నాయక్, రాజేందర్,బాలు, రాజు,గోపి, శ్రీకాంత్, నాయకులు, యువకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# వార్డు కౌన్సిలర్ ను సన్మానించిన సహృదయ ఫౌండేషన్ సభ్యులు



**ఆమనగల్లు, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీలో ప్రజలచే నూతనంగా ఎన్నుకోబడిన 10వ వార్డు కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డిని సహృదయ ఫౌండేషన్ సభ్యులు పూలమాలలతో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. చిన్ననాటి మిత్రుడు కోగూరి శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్లు మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ గా గెలిచిన శుభ సందర్భంగా సహృదయఫౌండేషన్ సభ్యులు తమ ఆనందాన్ని వారితో పంచుకొని, శ్రీనివాస్ రెడ్డి రాజకీయ జీవితం లో మరెన్నో రాజకీయ పదవులను అలంకరించాలని చిన్ననాటి మిత్రులు, సహృదయ ఫౌండేషన్ సభ్యులు తమ ఆశాభావాన్ని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..నా శక్తి మేర ఈ సహృదయ ఫౌండేషన్ కు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని, ప్రతి ఒక్కరి కి అందుబాటులో ఉంటూ, ప్రతి కష్టంలో ప్రతి సంతోషంలో పాలు పంచుకుంటానని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అనంతరం మిత్రులందరికీ హోలీ వేడుకలను, సుఖసంతోషాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంద వేణు గోపాల్,రవి ప్రసాద్, రేగటి శ్రీనివాస్, చింతోజు రవి కిరణ్, బావండ్ల రమేష్, శంకరయ్య, గంగిశెట్టి వెంకటేష్, అవ్వారి పాండు, చెరుకు జనార్ధన్, ఏలే శివ కుమార్, గోజే ఆనంద్, సత్యం గౌడ్, రామచంద్రయ్య, గుర్రం కేశవులు, గుజ్జరి పాండు,అమర్నాథ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య భూములకే శఠగోపం..?

### ఆగ్రహంతో రగులుతున్న భక్తులు



**ఫరూక్‌నగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయం భూమి వివాదంలో చిక్కుకోవడం జిల్లాలో సంచలనంగా మారింది. ఆలయానికి చెందిన 75 ఎకరాల ఆస్తిలో గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘ భవనం నిర్మాణానికి సర్పంచ్ మానస, ఇతర నాయకులు భూమిపూజ చేయడం భక్తుల్లో ఆగ్రహానికి దారితీసింది.“శివయ్య భూములపైనే నిర్మాణాలా?”అంటూ భక్తులు ఈఓ శివకుమార్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదులపై ఈఓ స్థలానికి చేరుకుని పనులను నిలిపివేసి, తహసీల్దార్ నాగయ్య, ఆర్డీఓ సరితలకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. “సర్వే నంబర్ 33 దేవాదాయ శాఖదే. పాత రికార్డులు, పహాణీలు మా వద్ద ఉన్నాయి” అని ఈఓ స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, సర్పంచ్ వర్గం మాత్రం సర్వే నంబర్లు 34, 35 ప్రభుత్వ భూములేనని, గ్రామాభివృద్ధి దృష్ట్యా భవనాలు నిర్మించాలనే ఉద్దేశంతో భూమిపూజ చేసినట్లు చెబుతోంది.నూతన భవనాల భూమిపూజలో ఆలయ అర్చకుడు హాజరుకావడం గ్రామంలో మరింత చర్చనీయాంశమైంది.తహసీల్దార్ కార్యాలయం త్వరలోనే ఫీల్డ్ సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం. రెవెన్యూ రికార్డులు, మ్యాప్స్ ఆధారంగా తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.“శివయ్య భూములకు న్యాయం జరగాలి” అని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## చెరువులో గల్లంతైన గురుకుల విద్యార్థి మృతి

### -- కుటుంబానికి ఎగ్జిగ్రేషియో



**ఫరూక్‌నగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి చెరువులో పడి మృతి చెందాడు. తీవ్రంగా గాలించిన ఎన్డిఆర్ఎఫ్ బృందాలు బుధవారం ఆయన మృతదేహాన్ని వెలికితీశాయి.వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టడంతో ఘటన స్థలానికి మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.కుటుంబానికి రూ.7.50 లక్షల ఎగ్జిగ్రేషియో, ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ ఆర్డీఓ ఆర్.ఎన్. సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి



**ఎలిగేడు, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని ముప్పిరితోట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గోళ్ళే లక్షణ్ తండ్రి మొండయ్య దశదిన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై మృతుడికి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తానిపర్తి మోహన్‌రావు, చీకటి సంతోష్‌కుమార్, కవ్వంపల్లి నారాయణ, బాసంపల్లి వినోద్, భూసారపు శ్రీనివాస్, జల్లి రమేష్‌తో పాటు పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కడ్తాల్ లో హోలీ సంబరం










**కడ్తాల్, మార్చి 4 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
కడ్తాల్ పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకున్నారు. హోలీ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో జరుపుకున్న హోలీ చిత్రాలు నీలగిరి ఎక్స్ ప్రేస్ పత్రికలో...

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ను పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి



**కడ్తాల్, మార్చి 4 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
: రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం చల్లంపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ను పరామర్శించారు. అయన తల్లి చిత్ర పటానికి నివాళి అర్పించారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ




**ఆమనగల్లు, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినిలకు ఆమనగల్లు శివశక్తి యూత్ సభ్యుల 120 మంది విద్యార్థినిలకు పరీక్ష ప్యాడ్ లను అందజేశారు. శివశక్తి యూత్ కమిటీ సభ్యులు ఎంగలి శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థినిలు మంచిగా చదువుకొని పరీక్షల్లో మొదటి ర్యాంకును సాధించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, పాఠశాలకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మంచి పేరును తీసుకురావాలని అన్నారు. విద్య విషయంలో ఎటువంటి సమస్యలు వచ్చినా మేమున్నామని ఆయన విద్యార్థినిలకు మనోధైర్యాన్ని కలిగించారు. కార్యక్రమంలో శివశక్తి యూత్ కమిటీ సభ్యులు నవీన్, గుండ్రాతి కుమార్ గౌడ్, గుద్దేటి శివ, సూర్య ప్రకాష్, కార్తీక్ గౌడ్, మణికంఠ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి , తోటి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**కరీంనగర్ రూరల్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగునూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందింది. తక్షణమే అక్కడికి వెళ్లి తనిఖీ చేసిన పోలీసులు, నగునూరు గ్రామానికి చెందిన ఆళ్లకుంట అంజయ్య, సూర శ్రీను, అల్లేపు రవి, కొంచెం రఘు, సూర రాజేందర్‌లను మూడుముక్కలాట ఆడుతుండగా పట్టుకున్నారు.వారి వద్ద నుండి రూ.15,500 నగదు, పేకాట ముక్కలను సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు.కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ఎవరైనా అక్రమ పేకాటకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.

# తాడిత పీడిత ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు.....


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంపీ ధర్మ బిక్షంతో


పలు సమావేశాల్లో బుర్ర కొండయ్య

--బుర్ర కొండయ్య గౌడ్ .
--నేడు బుర్ర కొండయ్య రెండవ వర్ధంతి





కుటుంబ సభ్యులతో బుర్ర కొండయ్య గౌడ్

**ఎలిగేడు, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అంటూ ధర్మ పరిరక్షణకై విష్ణువు 10 అవతారాలు ఎత్తాడు కలియుగంలో ఆ అవతార పురుషుడు కళ్ళు మూసుకున్నాడేమో అందుకే పేదలకు పట్టెడు అన్నం ,గూడు ఏర్పాటు చేసుకొని ఉండేందుకు గుంట జాగా కరువయ్యాయి. భూస్వాములు, పెట్టుబడిదారులు, రాజకీయ దురాహంకారులు బడుగు జీవుల బతుకులను దుర్భరం చేస్తున్న సమయంలోనే ఒక శక్తిగా మారి తాడిత పీడిత ప్రజల బానిస సంకెళ్ల విముక్తి పోరులో పాల్గొని ప్రజా ఉద్యమాలు చేసిన బుర్ర కొండయ్య చిరస్మరణీయుడుగా నిలిచిపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గౌడ జన హక్కుల పోరాట సమితి ఏర్పాటుచేసి వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికుల హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి మరువలేనిది. ఆనాటి ప్రభుత్వాలు భూస్వాములు పెత్తందారులు గీత కార్మికులను పన్నుల పేరుతో వివిధ రకాల సమస్యలు సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తే గీత కార్మికుల హక్కుల గురించి కార్మికుల్లో చైతన్య స్ఫూర్తిని కలిగించి ఉద్యమాలు నడిపారు. అదే సమయంలో సిపిఐ పార్టీలో చేరి నిరుపేద ప్రజలకు అండగా నిలిచారు.

**దున్నేవాడిదే భూమి**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చర్లబూత్కుర్ గ్రామంలో జన్మించిన బుర్ర కొండయ్య కొంతకాలానికి ప్రస్తుత ఎలిగేడు మండల కేంద్రంలో నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజల పరిస్థితి దీన గాథలను చూసిన ఆయన దున్నేవాడిదే భూమి అంటూ వందల ఎకరాల ప్రభుత్వ సాగు భూమిని, ఇండ్ల నిర్మాణం కోసం అసైన్డ్ భూములను నిరుపేద ప్రజలకు పంచే విధంగా ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచారు. ఆయన చేసిన ఉద్యమ ఫలితంగా కూలీలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు వ్యవసాయదారులుగా మారారు.

**తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర**

స్వతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా ఆయన పాల్గొన్నారు తర్వాతి కాలంలో సిపిఐ ఎమ్మెల్యే లు చెన్నమనేని రాజేశ్వరరావు, దేశిని చిన్న మల్లయ్య నాయకత్వంలో భూస్వాములు ఆగడాలపై పెత్తందారి దురహంకార వ్యవస్థలకు వ్యతిరేకంగా గళం విప్పి ప్రజా ఉద్యమాలు చేశారు. 2004 నుండి 2014 వరకు జరిగిన తెలంగాణ ఉద్యమంలో సిపిఐ పార్టీలో ఉంటూనే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం తన స్వరాన్ని గట్టిగానే వినిపించారు.


ఆనాటి ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ చైర్మన్ పెద్దపెల్లి ఎమ్మెల్యే గీట్ల ముకుందారెడ్డి గారితో కొండయ్య గౌడ్

ఎవరికి భయపడేది లేదు ప్రజల కోసమే ఈ జీవితం ప్రజల్లో ఉంటూ ప్రజల పక్షాన నిలబడి వందల ఎకరాల ప్రభుత్వ భూములు పంచిన బుర్ర కొండయ్య బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తన ప్రాణాలను సైతం అర్పించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ ఎవరికి భయపడేది లేదని తెగేసి చెప్పేవారు. నమ్మిన సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేసి పేద ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు. నేడు బుర్ర కొండయ్య రెండో వర్ధంతి సందర్భంగా ఈ ప్రాంత పేద ప్రజల పక్షాన ఘనంగా నివాళులర్పిస్తూ మీ నీలగిరి ఎక్స్ప్రెస్ ప్రత్యేక కథనం.

## శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి అభిషేకం ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్



**దేవరకొండ మార్చి 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** శ్రీశ్రీశ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అభిషేకాలు ఘనంగా ప్రారంభమైనయని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.బుధవారం స్వామి వారికి అభిషేకం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నో సమస్యలు తో బాధ పడుతూ ఏది కలిసిరాక ఇబ్బందులు పడుతూ ఏ పాపము చేసాము అని బాధ పడుతుంటారు చాలా మంది..ఒక వేళ నిజంగా ఏదైనా పాప కర్మ ఉండచ్చు లేకపోవచ్చు ఒక వేళ ఉంటే ఎటువంటి పాప కర్మ నుండి అయినా విముక్తి కలిగించేది శివుని అభిషేకమని ఆమె అన్నారు.శివుడు ఐశ్వర్య కారకుడు ఎన్నో ఆటంకాలు తొలగించి సంతోషాన్ని ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యనారాయణ వ్రతాలు, గండదీపాలు మరియు మొక్కులు చెల్లించుకుంటరని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి,ధరణిపతి రమణారావు, మాజీ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, ఆలయ పురోహితులు సురభి ప్రభాకర్ శర్మ,గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్,మర్రు పవన్ కుమార్,రెడ్డి పరమేష్ ముదిరాజ్,ఉడుత శంకరయ్య,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేసిన సర్పంచ్


అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారం పంపిణీ చేస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్.



**ఎలిగేడు, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని ఎలిగేడు--1 అంగన్వాడీ సెంటర్‌లో బుధవారం గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సర్పంచ్ కప్పల ప్రవీణ్ చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. అనంతరం చిన్నారుల బరువులు తూచి, కొత్త ఏఎల్ఎంఎస్సీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో సర్పంచ్‌ను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అంగన్వాడీ కేంద్రాలను గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ అంగన్వాడీ భవనం కోసం ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో తప్పకుండా మంజూరు చేయిస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, సరోజ, సరస్వతి, ఆశ పద్మతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**నల్లగొండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆమేర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మిర్యాలగూడ రోడ్ లో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా బషీర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ ముస్లింలు సోదర భావంతో ఎలాంటి సంఘవిద్రోహశక్తులకు తావివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ. హఫీజ్ ఖాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు నదీమ్, హాజీ, ఎంఐఎం నాయకుడు మోయిన్, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, ప్రకాశం బజార్ వ్యాపారస్తులు ఇడుకుల నరసింహ, ఆంజనేయులు, శ్యామ్, నవీన్, వనమా అశోక్, అంజద్, నసీర్, మూవీస్, ఇసాక్, రియాజ్, అజ్జు, యూనుస్, ముసురఫ్, ఫర్హాన్, సైఫ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు



**కరీంనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సహాయక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రభుత్వ వయోవృద్ధుల మరియు దివ్యాంగుల వసతి గృహంలో అయ్యప్ప స్వామి జన్మదినం (ఉత్తర నక్షత్రం) సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, మగవారికి లుంగీలు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు చిన్ని రామకృష్ణతో పాటు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని వసతి గృహ నివాసులకు ఆత్మీయంగా బహుమతులు అందజేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కరీంనగర్ రూరల్ పోలీసులు, గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి సంపత్ తన ట్రాక్టర్‌లో మానేరువాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టుకున్నారు.పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు.కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.

## రాములపల్లిలో ఘనంగా హోలీ సంబరాలు




హోలీ వేడుకల్లో రాములపల్లి సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్ దంపతులు

**ఎలిగేడు, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని రాములపల్లిలో బుధవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్ దంపతులు గ్రామ ప్రజలతో మమేకమై, యువకులతో కలిసి చిన్నా--పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు.

# వెల్దండలో యూరియా కోసం రైతుల ఆందోళన



**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలో యూరియా పంపిణీకి కొత్తగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైతులు బుధవారం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు.సొసైటీకి 700 బస్తాలు యూరియా వచ్చిన సమాచారం అందడంతో రైతులు ఉదయాన్నే చేరుకున్నారు. అయితే యాప్ ద్వారా బుకింగ్ జరగకపోవడంతో, కొందరు రైతులు ప్రయత్నించేలోపే స్టాక్ అయిపోయిందని తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. “మా వద్ద స్మార్ట్‌ఫోన్‌లు లేవు, యాప్ వాడడం తెలియదు. పాత విధానంలో పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా పంపిణీ చేయాలి” అని రైతులు డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న మండల వ్యవసాయాధికారి శోభారాణి, ఎస్‌ఐ కురుమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**దేవరకొండ మార్చి 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** వృత్తి ధర్మంలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే: గ్రామానికి చెందిన సామల ఎర్రయ్య (56) తండ్రి వెంకయ్య, కల్లు గీస్తూ జీవనం సాగిస్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ఒక్కసారిగా కాలు జారి కిందపడిపోయారు. ఇది గమనించిన సమీపంలోని రైతులు వెంటనే అక్కడికి చేరుకొని, తీవ్రంగా గాయపడిన ఎర్రయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడ చికిత్స పొందుతున్నారు. బాధితుడి పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



**హుస్నాబాద్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డులో చెత్తను విచ్చలవిడిగా పడవేయడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది.గవర్నమెంట్ హాస్పిటల్ బైపాస్--నాగారం రోడ్డుమధ్య చెత్త కుప్పలు పేరుకుపోవడంతో రోడ్డుపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రెండు రోజులపాటు శుభ్రపరిచి మళ్లీ అదే ప్రదేశంలో చెత్త వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసన కారణంగా రోడ్డుపై వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడగా, పక్కన ఉన్న ఇళ్లలో నివసించే ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు.పరిశుభ్రత లేకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోతున్నారు. అధికారిక డంపింగ్ షెడ్ ఉన్నప్పటికీ మున్సిపాలిటీ సిబ్బందే రోడ్డుమధ్య చెత్త వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మరికొందరు కూడా అదే ప్రదేశంలో చెత్త వేయడం ప్రారంభించడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.అధికారులు ఉన్నారాలేరా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మిక తనిఖీ



**సిద్దిపేట, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొమురవెల్లి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్, భాగార అన్నం రుచికరంగా లేకపోవడం, ఆలుగడ్డ పలచగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం వంటలు చేయకపోవడం, నాణ్యత లోపించడం పట్ల వంట సిబ్బందిని మందలించారు. కూరగాయలు లేకుండా ఇష్టానుసారంగా వంట చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఆదేశించారు. తరువాత పదవ తరగతి విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్, పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో తెలుసుకున్నారు. గణితంపై అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు తెలియజేయగా, గణితాన్ని సులభతరంగా నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల భోజనం, ఆరోగ్యం, వసతి, చదువు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేసి, సబ్ సెంటర్లలో ప్రజలకు వైద్యం ఎలా అందిస్తున్నారో ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని, మెడిసిన్, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# సోలార్ పవర్ ప్రచార వాహనం ప్రారంభం




**కరీంనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా సోలార్ విద్యుత్ అవగాహన ప్రచార వాహనాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కలెక్టరేట్ నుండి ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు వివిధ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనుంది. ఇందులో భాగంగా టీఎస్ రెడ్‌కో ఆధ్వర్యంలో జిల్లాలోని 16 మండలాల్లో సోలార్ విద్యుత్ పథకం గురించి ప్రజలకు వివరించనున్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చు. ప్రభుత్వం సబ్సిడీ కూడా కల్పిస్తోంది. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలి అని సూచించారు.


# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం గర్శకుర్తిలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు సాగర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయి. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను మరింత బలపరచడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, స్థానిక సర్పంచ్ చిందం ఆంజనేయులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రామిడి రాజిరెడ్డి, చిప్ప చక్రపాణి, సాగి అజయ్ రావు, రాజగోపాల్ రెడ్డి, గుండా రాజేశం, శ్రీనివాస్, మ్యాక్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సొంతింటి కలలు నిజం చేస్తాం

-- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ర్యాలపల్లిలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు బొజ్జ సునీత తిరుపతి దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడం మా లక్ష్యం. చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. రానున్న రోజుల్లో మరిన్ని ఇండ్లను అర్హులైన వారికి అందజేస్తాం” అని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు.ఇకపై నిరుపేదలు ఆందోళన చెందవద్దు. అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను నిజం చేస్తాం అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

# అర్హత గల ప్రతి విద్యార్థి ఉన్నత విద్య కొనసాగించాలి

-- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దకాల్వలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని సూచించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,




ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు, నైపుణ్యాల ఆధారిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ప్రతి అర్హత గల విద్యార్థి ఉన్నత విద్యలో కొనసాగాలని ఆయన సూచించారు.జిల్లావ్యాప్తంగా డిగ్రీ కళాశాల ప్రవేశాల ప్రచార కార్యక్రమాలు, కౌన్సిలింగ్ సమావేశాలు, ప్రచార పత్రాల పంపిణీ కొనసాగించాలని కలెక్టర్ ప్రిన్సిపల్‌కు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. లక్ష్మి నర్సయ్య, అధ్యాపకులు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ మారుతి, మురళి, డాక్టర్ షుకుర్, డాక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన హోలీ సంబరాలు




**కరీంనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులతో కలిసి రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు హోలీ పండుగ చిన్నా--పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలసి జరుపుకునే పండుగ అని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, వసంత ఋతువుకు స్వాగతం పలికే పండుగగా హోలీని భావిస్తామని పేర్కొన్నారు. డప్పు చప్పుల మధ్య జరిగిన ఈ రంగుల సంబరాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్




గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ కార్యాలయం వద్ద హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, పర్వతాల మల్లేశం, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ముందుకు సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంత్రులు, శాసనసభ్యుల సహకారంతో అభివృద్ధి బాటలు వేస్తాం. ప్రజా పాలనలో ప్రజల జీవితాలు రంగుల మయం కావాలి" అని అన్నారు.

## ఘనంగా చైతన్య మహాప్రభు
# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నల్లగొండ జిల్లా , మార్చి 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం రాత్రి యరుగండ్లపల్లి ఇస్కాన్ ప్రచార కేంద్రంలో ప్రొద్దుటూరి. రమణ , దేవేంద్ర నాథ్ దాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చైతన్య మహా ప్రభు చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాప్రభువు విగ్రహానికి వివిధ పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించి . భక్తి పాటలు, నృత్యాలతో రాత్రంతా సంకీర్తనలు నగర సంకీర్తన చేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ... శ్రీ చైతన్య మహాప్రభు ప్రేమ భక్తిని బోధించి, సమాజంలోని అన్ని వర్గాల వారికి ఆధ్యాత్మిక మార్గాన్ని సుగమం చేశారు. హరే కృష్ణ



హరే రామ మహామంత్రాన్ని పఠించడం ద్వారా భక్తిని ప్రపంచవ్యాప్తం చేశారు అని తెలిపారు . చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవంను (గౌర పూర్ణిమ) ప్రతి సంవత్సరం పాల్గుణ మాస పూర్ణిమ రోజున అత్యంత వైభవంగా జరుపుకుంటామని తెలిపారు..ఐతే 540 సంవత్సరాల తరువాత చంద్రగ్రహణం తో కూడిన పౌర్ణమి రావడం విశేషం... చైతన్యులు కూడా చంద్రగ్రహణం రోజే ఆవిర్భవించారు... రాధాకృష్ణుల అవతారంగా భావించే చైతన్యుడు 1486లో పశ్చిమ బెంగాల్‌లోని నవద్వీపంలో జన్మించారు. ఈ వేడుకల్లో భక్తులు హరినామ సంకీర్తన, ప్రత్యేక పూజలు, ఉపవాసం (ఏకాదశి), మరియు అభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ పండుగ వేడుకలు

**- జిహెచ్‌ఎంసి కార్మికులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త**



**ఎల్బీనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగోల్‌లోని తన నివాసంలో జిహెచ్‌ఎంసి కార్మికులతో కలిసి హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,




అంతర్జాతీయ ఆర్య వైశ్య సమాఖ్య జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. అందరికీ హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన మాట్లాడుతూ, "హోలీ కేవలం రంగుల పండుగ మాత్రమే కాదు. ధర్మం అధర్మంపై, సత్యం అసత్యంపై విజయం సాధిస్తుందని, భక్తి అన్ని అడ్డంకులను అధిగమిస్తుందని గుర్తు చేసే శాశ్వత సందేశం ఇది. హోలికా దహనం పవిత్ర అగ్నిజ్వాలల్లో మన దుఃఖాలు, అసూయ, ద్వేషం, కక్ష, అహంకారం అన్నీ దగ్ధమవ్వాలి. ఈ పండుగ మన ఆలోచనలను పవిత్రం చేసి, మన ఆత్మను పునరుజ్జీవింపజేయాలి" అని ఆకాంక్షించారు. నగర పరిశుభ్రతను కాపాడడంలో జిహెచ్‌ఎంసి కార్మికులు పోషిస్తున్న పాత్ర అమూల్యమని కొనియాడారు. "ప్రతి రోజు ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం కష్టపడుతున్న కార్మికులతో పండుగ ఆనందాన్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. హోలీ పండుగ ద్వారా సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలి" అని అన్నారు. జిహెచ్‌ఎంసి కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కార్మికులు, స్థానికులు పాల్గొని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు

**కరీంనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మేరా యువభారత్, కరీంనగర్ మరియు జిల్లా యువజన క్రీడల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి ఎం. వెంకట రాంబాబు తెలిపారు. ఈ పోటీలు కరీంనగర్ ఎల్‌ఎండిలోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరుగుతాయి. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయి. 13 సంవత్సరాల లోపు, 18 సంవత్సరాల లోపు, 18 సంవత్సరాలు పైబడిన వయో విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఆసక్తి గల క్రీడాకారులు మార్చి 8 ఉదయం 8 గంటలకు నేరుగా రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌కు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు పై స్థాయి పోటీలకు పంపిస్తారు. అదనంగా మహిళలకు వినోదాత్మక పోటీలు కూడా నిర్వహించబడతాయి. ఇతర సమాచారం కోసం పవన్, రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ 89771 48872ను సంప్రదించవచ్చని తెలిపారు.

# జాగ్రత్తలు లేకుండా గ్రానైట్ తరలింపు

**-- భయాందోళనకు గురైన ప్రజలు**




**హుస్నాబాద్ , మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న గ్రానైట్ హెవీ లోడ్ లారీ సేఫ్టీ చర్యలు పాటించకుండా, నెంబర్ ప్లేట్ లేకుండా నిర్లక్ష్యంగా తరలింపుచేస్తుండటం ప్రజల్లో ఆగ్రహానికి దారితీసింది. గ్రానైట్ వాహనాలు సేఫ్టీ బెల్ట్ లేకుండా తరలించడంతో గతంలో పలుమార్లు రాళ్లు జారి ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు కనీసం గమనించకపోవడం ప్రజల ప్రాణాలను లెక్కచేయనట్టే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండతోనే ఇలాంటి నిర్లక్ష్యం జరుగుతోందా? అని ప్రశ్నిస్తున్న ప్రజలు, ఇలాంటి వాహనాలను పోలీసులు గమనించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# సముద్రాల సర్పంచ్‌పై ఉపసర్పంచ్ ఫిర్యాదు

**హుస్నాబాద్ , మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలంలోని సముద్రాల గ్రామ సర్పంచ్ అట్ల శ్రీనివాస్‌పై ఉపసర్పంచ్ చింతకింది సింగరయ్య ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన తీర్మానాల రికార్డులపై సర్పంచ్ సంతకం చేయకపోవడం, బిల్లులను ప్రజలకు వివరంగా తెలియజేసినందుకు ఉపసర్పంచ్‌ను అవమానించడం, జాయింట్ చెక్ పవర్ ఖాతాను ఇప్పటివరకు తీయకపోవడం, వచ్చిన నిధులను గ్రామ అభివృద్ధి కోసం వినియోగించకుండా నిల్వగా ఉంచడం వంటి అంశాలను ఉపసర్పంచ్ ఆరోపించారు. అంతేకాకుండా వార్డు మెంబర్లపై కూడా సర్పంచ్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మేము ఎలాంటి తప్పు చేయలేదు, అయినప్పటికీ సర్పంచ్ అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారు అని ఉపసర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో తక్షణ విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో కలెక్టరుకు వినతిపత్రం సమర్పిస్తామని ఉపసర్పంచ్ స్పష్టం చేశారు.

# రైతులు కాల్వ నీటిని సద్వినియోగం చేసుకోవాలి



**పెద్దపల్లి, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువ ద్వారా సాగునీరు పెద్దపల్లి జిల్లాలోని డి-83, డి-86 కాలువలకు ఐదవ విడతగా మార్చి 1న విడుదలైంది. ఈ విడతలో 8 రోజులపాటు, అంటే మార్చి 9 వరకు నీటి విడుదల కొనసాగనుంది. సాగునీరు చివరి వరకు అందించేందుకు నీటిపారుదల శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాబట్టి రైతులు సిబ్బందికి సహకరించి తమ పొలాలకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇరిగేషన్ అధికారి విజ్ఞప్తి చేశారు.

## అమ్రాబాద్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హనుమంత్ రెడ్డి



**అమ్రాబాద్, మార్చి 4 (నీలగిరిఎక్స్‌ప్రెస్)**

అమ్రాబాద్ మండల కేంద్రానికి కొత్తగా వచ్చిన ఎస్ఐ హనుమంత్ రెడ్డిని స్థానిక ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించి ఆత్మీయతను వ్యక్తం చేశారు. ఎస్ఐ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతలను ఎల్లప్పుడూ కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారం తనకు ఎంతో అవసరమని, అందరి సహకారంతో సమగ్ర శాంతి భద్రతా వాతావరణాన్ని కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగుర్లకోటయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నోముల బాలలింగం గౌడ్, అబ్బు మక్బూల్, గోలి మల్లేష్, నిరంజన్, కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన అక్కన్నపేట సర్పంచ్



**హుస్నాబాద్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో 10వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను సర్పంచ్ బోమ్మ శ్రీశైలం పరిష్కరించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన వార్డు మెంబర్ ఎడబోయిన స్రవంతి, ప్రకాష్ రెడ్డితో కలిసి సింగిల్ ఫేస్ బోర్ మోటర్ ఫిట్టింగ్ చేయించి సమస్యను తీర్చారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించడంతో 10వ వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లింగాల కనకయ్య, గ్రామ కార్యదర్శి రామ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా లైన్‌మెన్ దివాస్ వేడుకలు



**పాలకుర్తి, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేశానికి రక్షకుడు సైనికుడైతే, రైతుకు రక్షకుడు విద్యుత్ శాఖలో నిరంతరం ప్రాణాలతో పోరాడే లైన్‌మెన్ అని రామగుండం ఏడిఈ ఎర్రోజు రమేష్ ప్రశంసించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జీఎం ఫంక్షన్ హాల్లో బుధవారం లైన్‌మెన్ దివాస్ సందర్భంగా లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఆర్టిజన్లు, స్పాట్ బిల్లర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందితో లైన్‌మెన్ దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏడిఈ రమేష్ మాట్లాడుతూ, ఎండనక వాననక 24 గంటలు ప్రాణాలకు తెగించి వినియోగదారులకు వెలుగులు పంచే నిజమైన హీరోలు లైన్‌మెన్లు. పనిలో రక్షణ పరికరాలను ధరించి, భద్రతా నియమాలు పాటిస్తూ కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. ఎస్ఎస్-3 అగ్రికల్చర్ 63 కేవీ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో 100 కేవీ కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సమస్య తీరింది. దీంతో రైతులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మానాల ప్రసాద్, సబ్ ఇంజనీర్ సాపిడి రాజ్‌కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ కాసుల కిరణ్, లైన్‌మెన్ మోతీలాల్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సహజ రంగులతో హోలీ సంబరాలు



**కరీంనగర్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోలీ పండుగను పర్యావరణ హిత దృక్పథంతో సహజ రంగులతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రసాయనిక రంగులను పూర్తిగా నివారించి, బిక్సా పువ్వు, పసుపు, మోదుగ, మందారం, తంగేడు, గన్నేరు, బంతి, రోజా, అపరాజిత, బీట్రూట్, క్యారెట్, శెవంటి వంటి పూలు మరియు సహజ వనరులతో రంగులను విద్యార్థులు స్వయంగా తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మనోజ్ కుమార్, డాక్టర్ విద్య, డాక్టర్ ఆర్. దేవేందర్, రేఖారాణి, ప్రియాంక, రావళి, అనిత, నారాయణ, మౌనిక తదితర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ, సహజ రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమించే అలవాటు పెంపొందించుకోవాలి" అని సూచించారు. డాక్టర్ మనోజ్ కుమార్ సహజ వనరుల ప్రాముఖ్యతను వివరించి, రసాయన రహిత హోలీ జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహజ రంగులతో హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య జాగ్రత్తలు, సంప్రదాయ విలువలపై అవగాహన కల్పించబడింది.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ఆమనగల్లు,మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ ప్రత్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీలోని 13వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మ్యాన్ హోల్ పరిస్థితిని స్వయంగా పరిశీలించి శుభ్రత పనులపై అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులు కూడా సమస్యలు వివరించారు. కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి శ్రీశైలం,రమేష్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ యూరియా యాప్ రైతులకు తికమక



**పాలకుర్తి, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

యాసంగి సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యూరియా యాప్ రైతులకు తలనొప్పిగా మారింది. పాలకుర్తి మండలంలోని ఈశాల తక్కల్లపల్లి, రామారావుపల్లి, కొత్తపల్లి, పాలకుర్తి గ్రామాల రైతులు ఈ యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరక్షరాస్య రైతులకు ఆన్లైన్ బుకింగ్ కష్టతరంగా మారగా, స్మార్ట్‌ఫోన్ లేని రైతులు యాప్, ఓటీపీ వంటి పదాలు అర్థం చేసుకోలేక తికమక పడుతున్నారు. యాప్ ద్వారా బుక్ చేసిన కొద్దిసేపటికే స్టాక్ అయిపోతుందని రైతులు వాపోతున్నారు. యూరియా అవసరమున్న రోజే బుక్ చేసుకోవాలని, ముందుగా నిల్వ పెట్టుకోరాదని అధికారులు హెచ్చరించడం రైతులకు మరింత ఇబ్బందిగా మారింది. రైతులు యాప్ ద్వారా కాకుండా నేరుగా సొసైటీల ద్వారానే యూరియా అందించాలని కోరుతున్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి యాప్ వినియోగంపై రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేసిన కేటీఆర్



**ఉప్పల్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యా ఫీజుల చెక్కులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "వైద్య విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయం. మీరు రేపటి వైద్యులు గనుక, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదర్శంగా తీసుకొని పేదలకు ఉచిత వైద్యం అందించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి

**హాలియా మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు కుందూరు జానారెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పి.ఏ ప్రవీణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హాలియా ఎఎంసి చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి శాలువా తో సత్కరించి పూల గుచ్చాన్ని అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కు సమస్యలపై వినతి పత్రం అందజేత




**ఆమనగల్లు, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఆమనగల్లు మునిసిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సమస్యలపై పురపాలక శాఖ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ వినతి పత్రం అందజేశారు. 12వ వార్డు లో కొన్ని ప్రధాన సమస్యలు సీసీ రోడ్లు, ఇంటింటికి మిషన్ భగీరథ,వాటర్ కనెక్షన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,వీధిలైట్లు,పాత ఇండ్లను,పాత గోడలను పడగొట్టడం, ఆసరా పింఛన్లు, పరిసరాల పారిశుద్ధ్య పనులు, అన్ని సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కి వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


# మా పార్టీ ఎప్పుడూ యుద్ధానికి అనుకూలం కాదు..

సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్




**న్యూఢిల్లీ మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తమ పార్టీ ఎప్పుడూ యుద్ధాలకు అనుకూలం కాదని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని, ఆ యుద్ధాలు ఆగకుండా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇవాళ ఉదయం ఎట్టావా లో తన అభిమానులతో కలిసి హోలీ సంబురాలు జరుపుకున్న అఖిలేష్.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశం ఒకటి మరో దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఎవరికి కూడా ఇలాంటిది జరగకూడదని అఖిలేష్ యాదవ్ అన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు మధురోను అమెరికా సైన్యం ఎత్తుకెళ్లడాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం భారత ప్రజలపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. సమాజ్‌వాది పార్టీ ఎన్నడూ యుద్ధాలకు అనుకూలం కాదని చెప్పారు.

# హోర్ముజ్ జలసంధి గుండా చైనా చమురు నౌకలకు మాత్రమే అనుమతి..!



**మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హోర్ముజ్ జలసంధిని మూసివేసింది.ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది .మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా.. ఇరాన్‌పట్ల సానుభూతి చూపుతుండటంతో అందుకు ప్రతిఫలంగా ఇరాన్ చైనా నౌకలకు అనుమతి ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రపంచ దేశాల నడుమ చమురు సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకం. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ తీరాలను ఓపెన్ సముద్రంతో కలిపే కీలక చోక్ పాయింట్. ఈ జలసంధిని మూసివేయడం వల్ల గ్లోబల్ సప్లయ్ చైన్‌కు విఘాతం కలుగుతుంది.

# నేడు నేపాల్ ఎన్నికలు



**ఖట్మాండు : మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నేపాల్‌లో గురువారం నాడు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నేటు ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. నేపాల్ జనాభా సుమారు 3 కోట్లు కాగా, ఇందులో సుమారు 1.9 కోట్ల మంది ఓటర్లు. ఓటర్లలో ఎక్కువ మంది యువతే ఉన్నారు. నేపాల్‌లో గతేడాది సెప్టెంబరులో జరిగిన జెన్ జెడ్ ఆందోళనల తరువాత అక్కడి ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో షెడ్యూల్ కంటే రెండు ఏళ్లు ముందుగా జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలను రాజకీయ మార్పు కోసం అన్వేషణగా విశ్లేషకులు భావిస్తున్నారు. నేపాల్‌లో లోక్‌సభగా భావించే ప్రతినిధి సభలో 275 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 165 మంది సభ్యులు ఫస్ట్ పాస్ట్ ది పోస్టు (ఎఫ్‌పిటిపి) ద్వారా ఎన్నికవుతారు. మిగిలిన 110 మంది ప్రోపోర్షినల్ రిప్రసెంటేషన్ (పిఆర్) ద్వారా సభకు వెళ్తారు. అంటే రాజకీయ పార్టీలకు దేశ్యా వ్యాప్తంగా వచ్చిన ఓట్ల ఆధారంగా ఈ సీట్లు కేటాయిస్తారు. అంటే నేపాల్‌లో ఓటర్లు రెండు ఓట్లు వేస్తారు. ఒకటి ఆ నియోజకవర్గంలో అభ్యర్థికి, రెండోది పిఆర్ కింద పార్టీకి. ఈ కారణంగా నేపాల్‌లో ఓట్ల లెక్కింపు సుదీర్ఘంగా జరుగుతుంది. పూర్తి ఫలితాలను వెల్లడించానికి కనీసం ఒక నెల రోజులు పడుతుంది.

# ఆరుతడి పంటల దిశగా రాష్ట్రం..

- ఇక్రిశాట్‌లో రైతు కమిషన్ సుదీర్ఘ మంతనాలు







**హైదరాబాద్, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న నీటి కొరతల నేపథ్యంలో సుస్థిర వ్యవసాయ మార్గాల అన్వేషణకు రాష్ట్ర రైతు కమిషన్ కీలక అడుగులు వేస్తోంది. పటాన్‌చెరువు సమీపంలోని అంతర్జాతీయ పంటల పరిశోధనా సంస్థ ఇక్రిశాట్ ను ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డితో కలిసి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుల బృందం సందర్శించింది. జిల్లాల పర్యటనలకు ముందుగా శాస్త్రీయ అవగాహన పెంపు, పంటల మార్పిడి విధానాలపై లోతైన చర్చ లక్ష్యంగా ఈ పర్యటన నిర్వహించినట్లు కమిషన్ వెల్లడించింది. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా తక్కువ నీటితో అధిక దిగుబడి ఇస్తున్న జొన్న, శనగ, కంది, వేరుశెనగ, మిల్లెట్లు వంటి ఆరుతడి పంటలను కమిషన్ సభ్యులు ప్రత్యక్షంగా పరిశీలించారు. వాతావరణ మార్పులకు తట్టుకునే విత్తన రకాలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాంకేతిక పద్ధతులు, చీడపీడల నివారణలో అనుసరిస్తున్న సమగ్ర నిర్వహణ విధానాలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రకం పచ్చిమేత పంట అభివృద్ధి విధానం కూడా కమిషన్ దృష్టిని ఆకర్షించింది. తదుపరి సమావేశంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్‌తో పాటు పలువురు సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం విస్తృతంగా సాగవుతున్న వరి ఆధారిత వ్యవసాయ విధానానికి ప్రత్యామ్నాయంగా శనగ, మిల్లెట్లు, వేరుశెనగ వంటి పంటల మార్పిడిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని కమిషన్ ప్రతిపాదించింది. నీటి సంరక్షణ, మట్టిసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయం పెంపు వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దూరదృష్టితో తెలంగాణ ప్రాంతంలో ఇక్రిశాట్ స్థాపించబడిన విషయాన్ని కమిషన్ చైర్మన్ గుర్తుచేశారు. దేశానికే కాక ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత సాధనలో ఈ సంస్థ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో శాస్త్రీయ సూచనల ఆధారంగా విధాన నిర్ణయాలు తీసుకోవడం అత్యవసరమని కమిషన్ అభిప్రాయపడింది. ఇక్రిశాట్ పర్యటనలో సేకరించిన అంశాలపై సమగ్ర నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కమిషన్ వెల్లడించింది. వరి, పత్తి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పంటల మార్పిడి విధానాన్ని అవలంభించి తక్కువ నీటితో అధిక లాభదాయకత కలిగిన ఆరుతడి పంటల సాగు వైపు తెలంగాణ రైతాంగం మళ్లాలని కమిషన్ పిలుపునిచ్చింది. ఈ పర్యటనలో రైతు కమిషన్ సభ్యులు, అధికారులు పాల్గొనగా, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు సాంకేతిక వివరాలను వివరిస్తూ రాష్ట్రానికి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధమని తెలిపారు.

# సీఎం పదవి కోసం విప్లవం చేయాల్సిన అవసరం లేదు

**న్యూఢిల్లీ మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని, కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసని చెప్పారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తున్న వార్తల గురించి తనకు ఎలాంటి



సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ చెప్పారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందని తెలిపారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని, కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని చెప్పారు. సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపారేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు-తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# బిహార్ రాజకీయాల్లో కీలక మలుపు..

రాజ్యసభకు బిహార్ సీఎం నితీష్ కుమార్..?

**న్యూఢిల్లీ మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బిహార్ రాజకీయాలు కీలక మలుపు తిరగబోతున్నాయా..? తాజా ప్రచారం చూస్తుంటే ఔననే అనిపిస్తోంది. బిహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్లబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే బిహార్ రాజకీయాల్లో సంచలనం రేగడం ఖాయం. ప్రస్తుతం ఎన్డీయే ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం కొలువుదీరి ఉంది. బిహార్‌లో నితీష్ కుమార్ (జేడీయూ) సీఎంగా కొనసాగుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఆయనకు సీఎం పదవి దక్కింది. కానీ, కూటమిలోని బీజేపీకి ఎక్కువ అసెంబ్లీ స్థానాలున్నాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయేకు 202 సీట్లున్నాయి. అందులో అత్యధికంగా బీజేపీకి 89, ఆ తర్వాత జేడీయూకు 85, కూటమిలోని మిగతా పార్టీలకు 28 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి



నుంచి నితీష్ తప్పుకొంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయనను రాజ్యసభకు పంపాలని జేడీయూ, బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం దీనికి కావాల్సిన ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. జేడీయూ కూడా దీనిపై అంగీకారం తెలిపింది. రాజ్యసభకు నితీష్ నామినేషన్ వేసేందుకు తగిన పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. ఆయన సంతకం పెడితే చాలు.. నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధమైంది. బిహార్ నుంచి జేడీయూ తరఫున రెండు రాజ్యసభ స్థానాలకు అవకాశం ఉంది. అందులో రామనాథ్ ఠాకూర్‌ను ఒక అభ్యర్థిగా ఖరారు చేశారు. రెండో అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ రెండో స్థానంలోనే నితీష్ రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉంది. నితీష్ దీనికి పూర్తిగా అంగీకరిస్తే గురువారం నాడే నామినేషన్ దాఖలు చేస్తారు. ఇదే జరిగితే నితీష్ బిహార్‌లో చేపట్టబోయే మలిదశ 'సమృద్ధి యాత్ర' వాయిదా పడొచ్చు. ఈ యాత్ర ఈ నెల 8న ప్రారంభం కావాలి. నితీష్ రాజ్యసభకు వెళ్తే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో బిహార్‌కు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఈసారి ఆ స్థానాన్ని కూటమిలో అత్యధిక స్థానాలున్న బీజేపీ తీసుకుంటుంది. ఆ పార్టీ అభ్యర్థి నూతన సీఎం అవుతారు. రాష్ట్ర రాజకీయాల నుంచి నితీష్ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకోవడం కూడా ఆయన రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడానికి కారణమని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే స్పష్టత రానుంది.